క్లుప్తంగా

50మందికి అన్నదానం



నేతాజీ గ్రంథాలయం వద్ద అన్నప్రసాదం తింటున్న నిరుపేదలు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో 50మంది నిరుపేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణకు దోహదపడుతున్న వారికి సంజీవనాయుడు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళావతి, జి.సాధు, ఎన్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1నుంచి పశువులకు టీకాలు

పార్వతీపురం: వేసవిలో పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మార్చి 1నుంచి జిల్లా వ్యాప్తంగా టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధకశాఖాధికారి ఎ.ఈశ్వరరావు తెలిపారు. ప్రతి మండలంలో పశువైద్య కేంద్రాల పరిధిలో శిబిరాలను నిర్వహించి టీకాలు వేయనున్నట్లు చెప్పారు. గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సిర్లి ఎల్లమ్మ జాతరకు భక్తులు సహకరించాలి

సీతానగరం: మండలంలోని రెండు గ్రామాల్లో సోమవారం నిర్వహించే సిర్లిఎల్లమ్మ జాతరలో పాల్గొనే భక్తులు సహకరించాలని ఎస్సై కె.నీలకంఠం కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ సిర్లి ఎల్లమ్మ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సీతానగరం, అంటిపేట గ్రామాల్లో సోమవారం జాతర జరుగుతుందన్నారు. జాతరను పురస్కరించుకుని భక్తులు కోళ్లు, చేపలు, కోడి గుడ్లు,టెంకాయలు పూజాసామగ్రితో ఉత్సవాలకు మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే సమయంలో సంయమనం పాటించి శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీసు వారికి సహకరించాలని కోరారు.

రేపటి నుంచి సరిహద్దు మాత ఉత్సవాలు



సంతోషిమాత మూలవిరాట్

భామిని: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో వెలసిన బత్తిలి సంతోషీశ్వర, ఆంజనేయ, నవగ్రహ సహిత మాత ఆలయంలో పంచరాత్రుల ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. తెలుగు–ఉత్కళ సమ్మేళనంగా ఈ నెల 28 నుంచి మార్చి 4 వరకు సరిహద్దు మాత 37వ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు. వేదపండితులచే నిత్య హోమాదికాలు, గోత్రనామాలతో అభిషేకాలు, నిత్యపూజలు నిర్వహిస్తారు. మంగళవారం నాడు సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని గ్రామ తిరువీధుల్లో ఊరేగించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశాలోని రాయగడ, గజపతి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సిబ్బంది ఏర్పాటు చేశారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణారావు

సీతంపేట: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని డీఎస్పీ జీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక ఏపీఆర్ గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఆదివారం జరిగిన ఫేర్‌వెల్ డే ఫంక్షన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈ దశలో తీసుకున్న నిర్ణయాలే భవిష్యత్‌ను నిర్దేశిస్తాయన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే రహదారి భద్రత, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలు, దిశ చట్టం, దిశ యాప్ వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. మహిళా పోలీసులతో సమావేశమై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సారా నిర్మూలనకు కృషిచేయాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లతో సమావేశమై ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ మురళీధర్, ఎస్సై నీలకంఠరావు తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు

- ఉద్యోగులు, గ్రామస్తులకు తొలగనున్న ఇబ్బందులు



పెదభోగిలిలో పూర్తి కావచ్చిన సచివాలయ భవనం



వెంకటాపురంలో ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం



వెంకటాపురంలో జరుగుతున్న ఆర్బీకే భవనం పనులు



నిర్మాణంలోఉన్న నిడగల్లు విలేజ్ క్లినిక్

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే ప్రజలకు సేవలందించడానికి కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. దీంతో ఆ భవనాలను ప్రారంభించడానికి అధికారులు సిద్ధం చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో 21 సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించడానికి అనుగుణంగా రూ.42 లక్షలతో మౌలిక సదుపాయాలతో సచివాలయ భవనం, రూ21 లక్షల వ్యయంతో రైతు భరోసా భవనం, రూ.22 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు పెదభోగిలి- 1,పెదభోగిలి–2, పెదంకలాం, వెంకటాపురం, నిడగల్లు, కాశీపేట, సీతానగరం, గాదెలవలస, తామరఖండి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస, సూరంపేట, గుచ్చిమి, జానుమల్లువలస, జోగింపేట, చినభోగిలి, అంటిపేట గ్రామాల్లో భవన నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి.

పనుల్లో వేగం

సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా నిర్వాహకులు పనులను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో వెంకటాపురంలో సచివాలయ భవనం ప్రారంభించడానికి సిద్ధం చేయగా రైతుభరోసా భవనం పూర్తి కావచ్చింది. మిగతా గ్రామాల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి, మండల కేంద్రంలోని పెదభోగిలి-1, పెదభోగిలి-2, కాశీపేట, తామరఖండి గాదెలవలస, నిడగల్లు సచివాలయాల భవనాలు పూర్తి కావడంతో ప్రారంభిచడానికి గ్రామపెద్దలు సిద్ధం చేశారు. అలాగే గుచ్చిమి, నిడగల్లు గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల భవనాలు పూర్తి కావచ్చాయి. వెంకటాపురం, పెదంకలాం, కేఎస్ పురం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటికే ఆర్.వెంకంపేట సచివాలయం పరిధిలోని రామవరంలో నిర్మించిన రైతు భరోసా భవనం, ఆర్ వెంకంపేటలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించడంతో రోగులకు, రైతులకు సచివాలయ ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక అనంతరం ప్రారంభం



మండలంలోని సచివాలయ భవన నిర్మాణాలు పూర్తికావడంతో ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్మిస్తున్న భవనాల పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి జరుగు తున్నాయి. పూర్తయిన భవనాలను ఎమ్మెల్సీ ఎన్నికలనంతరం ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నాం.

పి. శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ,సీతానగరం.

జోగింపేటకు హంగులు



ఆర్చిని ఆనుకుని అమర్చిన పూలకుండీలను పరిశీలిస్తున్న సర్పంచ్ సింహాచలం

సీతానగరం: మండలంలో రాష్ట్రరహదారిని ఆనుకుని ఉన్న జోగింపేట గ్రామానికి లక్షలాది రూపాయల వ్యయంతో ఆర్చి, పూలవనాలు నిర్మించి గ్రామానికి హంగులు దిద్ది గుర్తింపు తీసుకురావాలన్నదే తనముందున్న కర్తవ్యమని సర్పంచ్ కె.సింహాచలం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి వన్నె తెచ్చేలా మంచి కార్యక్రమం చేపట్టాలని తన మదిలో ఉందన్నారు. ఈ మేరకు సొంత నిధులతో రాష్ట్ర రహదారి– జోగింపేట వద్ద జంక్షన్‌లో ఆర్చి నిర్మించినట్లు తెలియజేశారు. రహదారి పొడవునా ఏడాది క్రితం ఉపాధి హామీ పథకం, స్వచ్ఛంద సంఘాల నాయకులు నీడనిచ్చే మొక్కలు వేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. తానుకూడా జంక్షన్ వద్ద నిర్మించిన ఆర్చి నుంచి దారి పొడవునా పూల కుండీలతో మొక్కలు వేయనున్నట్లు తెలియజేశారు.

నారాయణపురంలో పైపులైన్ మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

బలిజిపేట:

మండలంలోని నారాయణపురంలో ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు. 'వీధి కుళాయిల నుంచి కలుషిత నీరు' శీర్షికన సాక్షి దినపత్రికలో ఆదివారం వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. దీనిపై ప్రధాన పైప్‌లైన్‌లో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయనే పరిశీలన నిమిత్తం పైప్‌లైను తవ్వించి మరమ్మతులు చేపట్టారు. సువర్ణముఖి నదినుంచి ఓహెచ్ఎస్ఆర్‌కు వెళ్లే పైప్‌లైన్‌లో చెత్తాచెదారాలు చేరి ఉండడంతో కలుషిత నీరు వస్తున్నట్టు గుర్తించిన అధికారులు వాటి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.



పైపులైన్ మరమ్మతులు చేస్తున్న కూలీలు

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణం, మండలంలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం మోడల్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని దీప్తి, భాష్యం పాఠశాలలతో పాటు మండలంలోని కురుకుట్టి, అంటివలస, కొత్తవలస, తదితర పాఠశాలల్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్ష పత్రాలను ఏఎస్సై శ్రీనివాసరావు, కాశీ మాష్టారు, రామారావు, పండు, వరుణ్, తదితరులు విడుదల చేశారు. త్వరలో పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని పారదోలేందుకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.

ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వెనకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు కళింగవైశ్య సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళింగవైశ్యుల సమస్యలను పరిష్కరించేందుకు తప్పకుండా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. అందరికీ అందుబాటులో ఎప్పుడూ ఉంటానని, ఎవరికైనా సమస్య ఉంటే తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళింగ వైశ్యసంఘం అధ్యక్షుడు గుడ్ల ప్రసాద్, అందవరపు కోటేశ్వరరావు, కొత్తకోట ప్రసాద్, గుడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బలిజిపేట: మండంలోని పలగరలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే జోగారావు ఆదివారం పరిశీలించారు. పలగరలో సుమారు రూ.14లక్షలతో శ్మశానం నుంచి అమ్మవారి గుడివరకు 380మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణాన్ని, బీసీ కాలనీలో నిర్మాణాలు పూర్తయిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కాలనీలోని మూడు రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, జాన్, ఎస్.భాస్కరరావు, టి.ప్రసాద్, కె.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



పలగరలో అమ్మవారి గుడికి నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం



నూతన జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ముగడ జగన్ మోహన్ ఆదివారం స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన 26 జిల్లాల్లో 25 పార్లమెంట్ 171 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీసీ సంక్షేమ సంఘం సహకారంతో వికేంద్రీకరణ సాగుతుందన్నారు. మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు రాష్ట్రంలో ఉన్న బీసీలకు ప్రజాస్వామ్య బద్ధంగా న్యాయం చేయాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడ్ని సంఘం సభ్యులు అభినందించారు.

సృష్టికి మూలం స్త్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్టీ గంగాభవాని

భామిని: మండలంలోని గురండి విద్యావికాస్ హైస్కూల్‌లో శ్రీగురు విశ్వస్ఫూర్తి ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో స్త్రీశక్తి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ, స్కూల్ చైర్మన్ మాసాపు మిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో వక్తలు సృష్టిలో స్త్రీ పాత్రను వివరించారు. స్త్రీ లేనిదే మానవ సృష్టి లేదని, ఆధునిక ప్రపంచంలోనూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. భామిని కేజీబీవీ ఎస్ఓ భూరాడ శారద, సింగిడి వ్యాపారవేత్త గుడ్ల సత్యారావు, ప్రిన్సిపాల్ ఎం.గాంధీరాజు, సంస్థ సమన్వయకర్త, విద్యావేత్త వలరౌతు షణ్ముఖరావు, స్ఫూర్తి ట్రస్టీలు ఎం.గంగాభవాని, ప్రమీల, సౌజన్య, మేనేజింగ్ ట్రస్టీ వి.సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస్ పరీక్ష

పార్వతీపురం టౌన్: ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస్ పరీక్షను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్య జిల్లా ఉపాధ్యక్షుడు సింహాచలం, న్యాయవాదులు జోగారావు, కె. రాజు, ఎస్.సింహాచలం ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఈ ప్రజ్ఞా వికాస్ పరీక్ష దోహదపడుతుందన్నారు.ప్రపంచీకరణ విధానాలకు లోనుకాకుండా భవిష్యత్తు లక్ష్య సాధనకు కృషిచేయాలని, గిరిజన ప్రాంతంలో విద్యకు దూరంగా ఉన్న వారికి విద్యను అందించే టట్లు విద్యార్థుల ఆలోచనలు మెరుగుపడాలని పిలుపునిచ్చారు. పరీక్షల్లో ఎటువంటి భయాందోళనకు గురికాకుండా ఏకదృష్టితో మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకుడు శర్మ, మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షురాలు సరోజిని, లలిత తదితరులు పాల్గొన్నారు.



ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్సీలంటే అలుసా?



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ఉమమాహేశ్వరరావు

పార్వతీపురం: జనసేన నాయకుడు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు వి.దాలినాయుడికి ఎస్సీలంటే అంత అలుసా అని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఎస్సీలంటే జనసేన నాయకుడి విషయంలో అణగారిన వర్గాల కిందకు వస్తారా? అని ప్రశ్నించారు. జనసేన నాయకుడికి పబ్లిసిటీ పిచ్చిపట్టిందన్నారు. ఎస్సీల మనోభావాలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన నాయకుడిపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ఎస్సీలకు జనసేన నాయకుడు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రారంభమైన శిర్లిపోతన్న, ఎల్లమ్మ జాతర



భక్తులచే పూజలందుకుంటున్న శిర్లిపోతన్న, ఎల్లమ్మలు

పాలకొండ: నగర పంచాయతీలో శిర్లిపోతన్న, ఎల్లమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. శిర్లిపోతన్న వీధిలో వెలసిన దేవతామూర్తులకు భక్తులు పూజలు చేశారు. కొత్తగా నిర్మించిన ఆలయ శిఖరాన్ని పునఃప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సోమవారం కూడా యాత్ర సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

28న శిర్లిఎల్లమ్మ జాతర

కురుపాం: ఈ నెల 28న శిర్లి ఎల్లమ్మ తల్లి జాతర ప్రారంభం కానుంది. మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న శిర్లి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం 5 గంటల నుంచి కురుపాం నెయ్యిలవీధిలో ఉన్న గర్భగుడిలో ఎల్లమ్మతల్లిని భక్తులు దర్శించుకుంటారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు శిర్లి ఎల్లమ్మ మత్స్య పారిశ్రామిక సంఘ సభ్యులు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించండి

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్



ప్రచారంలో పాల్గొన్న టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్:

వచ్చేనెల 16న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలోని బాలగుడబ, వెంకంపేట, చినబొండపల్లి, సంగంవలస గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా నామినేషన్ సమర్పించిన సీతంరాజు సుధాకర్‌ను ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు–1గా పేరు ఎదురుగా ఉన్న ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించండి

పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూరల్ నాయకులతో ఓట్ల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చేనెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ప్రతి గ్రామంలో నమోదైన పట్టభద్రులు ప్రతి ఒక్కరినీ గుర్తించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి వారిని ప్రత్యక్షంగా కలుసుకొని ప్రచారం చేసి కరపత్రాలను అందజేయాలని స్పష్టం చేశారు. 1వ ప్రాధాన్యత ఓటు సీతంరాజు సుధాకర్‌కు వేసి తప్పక గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విజయంతో మన ప్రాంత ప్రజల పరిపాలన రాజధాని ఆకాంక్షను తెలియజేసేలా ముఖ్యమంత్రి జగనన్నకు పూర్తి మద్దతు అందించేలా మనమంతా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, బి.కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ బి.వాసుదేవరావు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

ఏనుగుల జోలికి పోవద్దు



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై హరికృష్ణ

వీరఘట్టం: మండలంలోని కిమ్మి–నడుకూరు గ్రామాల మధ్య పంటపొలాల్లో తిష్ట వేసిన ఏనుగులను తరిమేందుకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. కొద్ది రోజుల కిందట చెరుకు తోటలో ఉన్న ఏనుగులను తరమేందుకు ఓ వ్యక్తి పంటకు నిప్పు పెట్టాడు. ఈ వ్యవహారం అటు పోలీసులకు, ఫారెస్టు అధికారులకు తలనొప్పిగా మారింది. ఇదిలా ఉండగా ఆదివారం మరికొందరు వ్యక్తులు ఏనుగులను తరిమికొట్టేందుకు తారాజువ్వలను విడిచిపెట్టారు. దీంతో ఏనుగులు భయంతో పరుగులు తీసి, సమీపంలో ఉన్న పంటలను ధ్వంసం చేశాయి. తారాజువ్వలు వదలడంతో వాటి నిప్పురవ్వలు అంటుకుని కిమ్మి సమీపంలోని ఓ రైతుకు చెందిన ఐదు ఎకరాల చెరుకుతోట దగ్ధమైంది. విషయం తెలియడంతో ఎస్సై ఎం.హరికృష్ణ కిమ్మి గ్రామానికి చేరుకుని పలువురిని హెచ్చరించారు. ఏనుగులను కవ్వించొద్దని కోరారు. ఏదైనా జరగరానిది జరిగితే అందరం ఇబ్బందులు పడాల్సి వస్తుందని సూచించారు.